
హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు, జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

# హరహర మహాదేవ..

- శివనామస్మరణతో మార్మోగిన అలంపూర్ క్షేత్రం
- కనుల పండువగా పార్వతీపరమేశ్వరుడి కల్యాణం
- మహాకుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ దంపతులు

అలంపూర్, మార్చి 8 : ఓం నమశ్శివాయ.. హరహర మహాదేవ.. శంభో శంకరా.. అంటూ శివనామస్మరణతో అలంపూర్ క్షేత్రం మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లింగోద్భవ కాలంలో బోళా శంకరుడిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం శనివారం తెల్లవారుజామున జోగుళాంబ ఆలయం ఎదుట రాజగోపురం పరిసరాల్లో ఆది దంపతుల కల్యాణం కనుల పండువ గా నిర్వహించారు. చారిత్రక ప్రసిద్ధిగాంచిన సంగమేశ్వర ఆలయం, నవబ్రహ్మలయాలు, జోగుళాంబ ఆలయం, కోటిలింగాలలో కొలువైన అలంపూరు క్షేత్రంలో మహా శివరాత్రి వేడుకలు భక్తి శ్రద్ధలతో శోభిల్లాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ సంతోష్ దంపతులు, స్థానిక కోర్టు జడ్జి కమలాపురం కవిత తదితరులు దర్శించుకున్నారు. మహా కుంభాభిషేకంలో భాగంగా బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ శిఖరంపై గల కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కలశాన్ని అభిషేకించారు. కుంభాభిషేక మహోత్సవం ప్రతి 12 సంవత్సరాలకోసారి నిర్వహిస్తారని, కుంభాభిషేకం విశిష్టత, ప్రత్యేకత, ఫలితాలు తదితర అంశాల గురించి బ్రహ్మశ్రీ అవ్వారి శ్రీనివాసశర్మ భక్తులకు వివరించారు. సంగమేశ్వర ఆలయం, నవబ్రహ్మలయాల్లో ప్రధాన ఆలయమైన బాలబ్రహ్మేశ్వర ఆలయం పైభాగంలో శివస్వాములచే ఆకాశ జ్యోతి కార్యక్రమం శుక్రవారం రాత్రి 12గంటలకు నిర్వహించారు. ఆకాశమార్గాన వెళ్తున్న జ్యోతికి భక్తులు జేజేలు పలికారు.

***కనుల పండువగా కల్యాణోత్సవం***

మహా శివరాత్రిని పురస్కరించుకుని లింగోద్భవ కాలంలో శనివారం తెల్లవారుజామున 2 గంటలకు ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ పాలక మండలి సభ్యులు, పుర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ ఔదార్యం

- నిత్యం రూ.వెయ్యి వెచ్చించి మూడు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా


ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న జనం

గట్టు, మార్చి 8 : కాంగ్రెస్ పాలనలో సాగు నీటితోపాటు తాగునీటికి కూడా కష్టాలు ప్రారంభమయ్యాయి. మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా రాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గట్టు మండలంలోని ఆలూరులో మిషన్‌భగీరథ తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గమనించిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ కుర్వ మల్లమ్మ ఔదార్యాన్ని చాటారు. సొంత ఖర్చులు వెచ్చించి గురువారం నుంచి ట్యాంకర్ల ద్వారా గ్రామానికి నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజూ రూ.వెయ్యి ఖర్చు చేసి గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా మూడు సార్లు నీటిని అందిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు సాఫీగా వచ్చే వరకు లేదా వర్షాలు పడేవరకు నీటిని అందజేస్తామని మాజీ సర్పంచ్ పేర్కొన్నారు. కాగా సర్పంచ్ సోదరుడు మేస్త్రీ తిమ్మప్ప ట్యాంకర్ పైప్ ద్వారా బిందెలో నింపుతున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.


శ్రీశైలంలో స్వామి,అమ్మవార్ల ప్రభోత్సవానికి భారీగా హాజరైన భక్తజనం


శివపార్వతులనుదర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండ్ల

## మహాశివుడికి ఎమ్మెల్యే బండ్ల పూజలు

కేటీదొడ్డి, మార్చి 8 : మండల కేంద్రంలోని శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన శివపార్వతుల కల్యాణానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మహాశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం మండలంలోని చింతలకుంట గ్రామంలో ప్రతిష్ఠించిన వాల్మీకి మహర్షిని కూడా దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు కలిసిమెలిసి ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైఎస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఉరుకుంద, నాయకులు ఉన్నారు.


లలితాసోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

## పులకించిన సోమశిల

- కృష్ణా తీరం వెంట భక్తుల పుణ్యస్నానాలు

కొల్లాపూర్, మార్చి 8 : భక్తుల శివనామస్మరణతో సోమశిల క్షేత్రం పులకించిపోయింది. శివ శివ శంకరా.. భక్తవశంకరా.. శంభో హరహర నమోన మో.. అంటూ లలితా సోమేశ్వరస్వామి ఆలయంలో మార్మోగింది. సోమేశ్వరాలయంలో రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు, అలంకరణ, లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కొల్లాపూర్ నుంచి ప్రత్యేక బస్సులను నడిపించారు. మహిళలు పెద్దఎత్తున సోమశిలకు తరలిరాగా.. ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సప్తనదిలో(కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలపహారిణి, భీమారతి, భవనాసి) కొందరు పుణ్యస్నానాలు ఆచరించారు. కొందరు మహిళలు మట్టితో గంగాదేవి ప్రతిమలను తయారుచేసి పూజించారు. ఆలయ పరిసరాల్లో పలువురు భక్తులు పూనకాలతో ఊగిపోయారు. ఏడాదిన్నర కాలంగా కృష్ణానదిలో మరబోట్లలో ఏపీ, తెలంగాణ ప్రాంతాలకు రాకపోకలు నిషేధించగా.. వైఎస్సార్‌సీపీ నేత బైరెడ్డి సిద్దార్థరెడ్డి జోక్యం చేసుకోవడంతో సోమశిల, సిద్దేశ్వరం మధ్య మరబోట్లు నడిపే వారి మధ్య వివాదానికి రాజీకుదుర్చినట్లు బోట్ల నిర్వాహకులు తెలిపారు. దీంతో సంగమేశ్వర ఆలయానికి మన భక్తులు బోట్లల్లో వెళ్లారు. ఒక్కొక్కరికీ రానుపోను కలిపి రూ.200 వసూలు చేశారు. ఆలయ ప్రాంగణంలో తినుబండారాల దుకాణాలు వెలిశాయి. కొల్లాపూర్ ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

# ఝుమ్మంది ఓంకారనాదం

- మదినిండా మల్లన్న నామస్మరణే..
- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- శ్రీశైలంలో భక్తఝరిని తలపించిన ప్రభోత్సవం
- శివనామంతో పులకించిన నల్లమల
- భౌరాపూర్‌లో నయనానందకరంగా ఆదిదంపతుల కల్యాణం

ప్రతి గుండెలో పంచాక్షరి జపం.. మదిమదిలో ఝుమ్మన్న ఓంకారనాదం.. ప్రతిధ్వనించిన ప్రణవ నాదం.. ప్రకృతి పరవశించేలా.. పరమ శివుడికి వినిపించేలా.. నమఃశివాయ నినాదాలు నింగినంటగా.. ఢమ.. ఢమ ఢమరుక శబ్దాలు హోరెత్తాయి. హరహర మహాదేవ.. శంభో శంకర.. అన్న భక్తుల నామస్మరణతో శైవ క్షేత్రాలు పులకించాయి. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లా శివనామస్మరణతో మార్మోగింది. అలంపూర్ మొదలు.. బీచుపల్లి, కందూరు, పామాపురం, బుద్దారం, ఉమామహేశ్వరం, భౌరాపూర్, శ్రీశైలం వరకు ఎక్కడ చూసినా శివయ్య నామమే.. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించి తన్మయత్వం చెందారు. ఆలయాలన్నీ కిటకిటలాడాయి. లక్షలాదిగా శివస్వాములు, భక్తులు తరలిరావడంతో శ్రీశైల క్షేత్రం జన సంద్రమైంది. భక్తుల జయజయధ్వానాల మధ్య ప్రభోత్సవంపై రుద్రనేత్రుడు భక్తజనులను కటాక్షించారు.


మహబూబ్‌నగర్ నీలకంఠేశ్వర ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు




జోగుళాంబ ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు


కొత్తకోట మండలంలోని పామాపురం ఆలయం వద్ద ఉన్న శివప్రతిమను దర్శించుకుంటున్న భక్తులు
మహబూబ్‌నగర్ సాంబశివాలయంలో దర్శనానికి బారులుదీరిన భక్తులు


నారాయణపేట జిల్లా కేంద్రంలోని శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


## ఎటుచూసినా శివనామమే..

- ఉమామహేశ్వరానికిపోటెత్తిన భక్తులు

అచ్చంపేటరూరల్, మార్చి 8 : మహాశివరాత్రిని పురస్కరించుకొని శివ నామస్మరణతో నల్లమల శైవక్షేత్రాలు మార్మోగాయి. శ్రీశైల ఉత్తర ద్వారంగా బాసిల్లుతున్న ఉమా మహేశ్వరాలయానికి మహాశివరాత్రి సందర్భంగా భక్తులు స్వామివారి దర్శననానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. పాపనాశినిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి కుంకుమార్చన, పరమశివుడికి అభిషేకాలు చేశారు. కొందరు భక్తులు ఆలయ ఆవరణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను అలంకరించిన రథంలో ఊరేగింపుగా తీసుకొచ్చి కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా చిన్నారి సాయిశివాని కూచిపూడి నృత్యం, మహిళా సంఘాల కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, ఈవో శ్రీనివాసరావుల ఆధ్వర్యంలోచర్యలుతీసుకున్నారు.

## శోభాయమానం.. ప్రభోత్సవం

- పాగ చుట్టిన మల్లన్న
- అర్ధరాత్రి వరకు లింగోద్భవకాల పూజలు
- శ్రీగిరి క్షేత్రంలో భక్తజన సందడి


నందివాహనంపై ఆసీనులైన భ్రామరీమల్లికార్జునుడు

శ్రీశైలం, మార్చి 8 : ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ప్రభోత్సవం శోభాయమానంగా నిర్వహించారు. ఆలయ గంగాధర మండపం నుంచి ప్రారంభమై నందిమండపం వరకు సాగిన ప్రభోత్సవంలో వేలాది భక్తులు పాల్గొని తన్మయత్వం చెందారు. ప్రభోత్సవం ఎదుట చేపట్టిన కోలాటాలు, చెక్కభజనలు, సంప్రదాయ మేళాల చప్పుళ్లు, కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామి,అమ్మవార్లు నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఆలయంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో పుష్పాలంకరణతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై భ్రామరీ సమేత మల్లికార్జునస్వామికి షోడషోపచార పూజలు నిర్వహించారు. ఆలయోత్సవంలో భాగంగా స్వామిఅమ్మవార్లు నందివాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

***పాగ చుట్టిన మల్లన్న..***

మహాశివరాత్రి పర్వదినాన మల్లన్నను వరుడిగా చేసే పాగాలంకరణ ఘట్టం వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. పాగను ప్రకాశం జిల్లా హస్తినాపురానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు కొడుకు సుబ్బారావు శివరాత్రి కల్యాణానికి స్వామివారి సువర్ణ గర్భాలయ కలశంపై నుంచి నవనందులను కలుపుకొంటూ ప్రత్యేక ఆకృతిలో అలంకరించారు. పాగాలంకరణ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో దిగంబరుడైన పృథ్వీ వేంకటేశ్వరులు చీకట్లో పాగాలంకరణ చేయడం స్వామివారి భక్తికి నిదర్శనం. కఠోర నియమాలతో సంవత్సరాంతం రోజుకో మూరచొప్పున నేసిన వస్త్రాలతో శివయ్యను పెండ్లి కొడుకును చేసేందుకు ఆభరణంగా ఉపయోగించడం సంప్రదాయమని అర్చకులు తెలిపారు. మరోవైపు లింగోద్భవ సమయంలో గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్ అండ్ ఈవో ఆధ్వర్యంలో 11 మంది నిష్ణాతులైన వేదపండితులు స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సుమారు నాలుగు గంటల పాటు శ్రీశైల మల్లన్నకు వివిధ రకాల శుద్ధజలాలు, పండ్లరసాలతో అభిషేకించారు. జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి శిష్య బృందంతో మల్లన్నకు పూజలు చేశారు.

***ఆదిదంపతుల లీలాకల్యాణం..***

లింగోద్భవం అనంతరం భ్రమరాంబ మల్లికార్జునస్వామికి లీలాకల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో స్వామిఅమ్మవార్లు పట్టు వస్త్రాలతో సర్వాలంకరణ శోభితులై నాగులకట్ట వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య నేత్రానందకరంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

***దర్శనాలకు గంటల తరబడి క్యూ..***

అర్ధరాత్రి దాటిన తరువాత నుంచి పాతాళగంగ వద్ద జల్లు స్నానాలు చేసుకొని దర్శనాలకోసం గంటల తరబడి క్యూ కాంప్లెక్స్‌లలో వేచి ఉన్నారు. టైం స్లాట్స్ ప్రకారం నిర్ణీత క్యూ ద్వారానే దర్శనాలకు అనుమతించారు. భక్తులందరికీ అలంకార దర్శనం ఏర్పాటు చేశారు. క్యూలో వేచి ఉండే భక్తుల కోసం పాలు, తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం శివసేవకులు అందించారు. భక్తుల రద్దీ కారణంగా శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి శనివారం ఉదయం వరకు మున్ననూరు, దోర్నాల నుంచి వచ్చే వాహనాలను నిలిపివేస్తున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.


పాతాళగంగ వద్ద శివస్వాములు

## భౌరాపూర్ ఉత్సవాలు షురూ

- భౌరమ్మ, మల్లికార్జునస్వామికికల్యాణంజరిపించినఆదివాసులు
- వేడుకలకుహాజరైన ఎమ్మెల్యే దంపతులు
- తరలొచ్చిన భక్తులు


సంప్రదాయ నృత్యాలు చేస్తున్న చెంచు మహిళలు

అచ్చంపేట, మార్చి 8 : మహాశివరాత్రి సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నల్లమలలోని భౌరాపూర్‌లో ఆదివాసీల జాతరను అధికారికంగా నిర్వహించారు. లింగాల మండలం భౌరాపూర్ ఆలయానికి పలు జిల్లాల నుంచి విచ్చేసిన చెంచుల సమక్షంలో శుక్రవారం భౌరమ్మ, మల్లికార్జున స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆదివాసి చెంచులు సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన కల్యాణానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఆయన సతీమణి జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అయితే చెంచుల ఆడపడుచు భ్రమరాంబదేవీగా, చెంచులు ఆరాధించే అల్లుడు మల్లికార్జున స్వామిగా పిలుస్తూ కల్యాణగట్టం నిర్వహించారు. అమ్మవారిని అలంకరించుకొని సంప్రదాయ బద్ధంగా వీరభద్రుడికి పూజలు చేసి నృత్యాలు చేస్తూ డప్పులతో ఎదుర్కోళ్లు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి కల్యాణం జరిపించారు. భౌరాపూర్ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపాన్ని నిర్మించాలని, కోనేరు నిర్మాణం చేపట్టాలని, చెరువు పూడికతీత, స్నానాల ఘట్టాలు నిర్మించాలని ఆదివాసీలు కోరారు. అమ్మాయి తరపున పెళ్లిపెద్దగా వ్యవహరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ చెంచులు అడిగిన డిమాండ్లను అంగీకరిస్తున్నట్లు వచ్చే జాతర వరకు శాశ్వత కల్యాణ మండపం నిర్మాణంతోపాటు అన్ని పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. సాంస్కృతికశాఖ కళాబృందం ద్వారా ఆర్డీటీ, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, చెంచుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీటీడీవో కమలాకర్‌రెడ్డి, డీఈ హేమలత, లింగాల ఎంపీడీవో ఆంజనేయులు, డీటీ రాములునాయక్, వివిధ ప్రాంతాల నుంచి చెంచులు, ప్రజలు పూజలు నిర్వహించారు.


భౌరాపూర్ ఆలయం వద్ద భక్తుల సందడి